ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 7 జూన్ 2025



పోడు భూములకు జల సిరులు 7
● ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలుకు కసరత్తు
● రాష్ట్రంలో తొలి విడతలో 10 వేల మంది ఎస్టీ రైతులకు వర్తింపు
● ఐదేళ్లలో ఐదు విడతల్లో ఆరు లక్షల ఎకరాలకు నీరు
బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష 6

వయోజన విద్యకు 'ఉల్లాస్'



- చదువు రాని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కార్యక్రమం
- నిరక్షరాస్యులను గుర్తించే పనిలో డీఆర్‌డీఏ సిబ్బంది
- విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- జిల్లాలో 14,964 మహిళా సంఘాలు... 1,73,412 మంది సభ్యులు



జగిత్యాల, జూన్6 (ఆంధ్రజ్యోతి): మహిళా సం ఘాల్లో ఉన్న నిరక్షరాస్యులైన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్‌ఫర్‌అన్‌ఇన్‌సొసైటీ) పథకాన్ని అమలులోకి తెచ్చింది. దేశంలో ఉన్న ప్రతీ మహిళా అక్షర జ్ఞానం కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ పథకాన్ని విద్యాశాఖ, సెర్ప్ ఉమ్మడి బాగస్వామ్యంతో ఈపథకాన్ని కొనసాగించనున్నారు. దశల వారీగా అమలు చేసే ఉల్లాస్ పథకంలో ముందుగా మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరస్యులుగా చేయడంతో పాటు రెండో దశలో మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా నేరుగా పదో తరగతితో పాటు వారి ఆసక్తిని బట్టి ఓపెన్ డిగ్రీ వరకు చదివించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

● ఉల్లాస్ లక్ష్యం...

సామాజిక సాధికారతలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువురాని వారందరికీ చదవడం, రాయడం నేర్పించడమే ఉల్లాస్ పథకం ప్రధాన లక్ష్యం. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల్లో కేవలం 50 శాతం మందికి మాత్రమే సంతకం చేయడం వచ్చని, మిగిలిన సగం శాతం మంది వేలి ముద్రలు వేస్తారనేది ప్రభుత్వం దగ్గర ఉన్న అధికారిక సమాచారం. మహిళలందరికీ చదవడం, రాయడం నేర్పించాలనే ఉల్లాస్ పథకం ఉద్దేశం. వయోజన మహిళలకు చదవడం, రాయడం నేర్పించడమే కాకుండా మధ్యలో బడి మానేసిన వారిని సైతం గుర్తించి వారిని నేరుగా ఓపెన్ టెన్త్, వారికి ఆసక్తి ఉంటే ఓపెన్ డిగ్రీ చదివిస్తారు. ఆ తర్వాత వారికి స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సులు నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మహిళలకు చదవడం, రాయడంతో పాటు బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక క్రమశిక్షణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను సైతం నేర్పిస్తారు.

● మహిళా సంఘాల్లో నిరక్షరాస్యుల గుర్తింపు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరక్షరాస్యులను గుర్తించే పనిలో ఉన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలో కొన సాగే ఈ ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమాన్ని సెర్ప్ అధికారులు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని మండలాల.. (మిగతా 8లో)

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ గడువు పెంపు

రాయికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2025-26 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్ల కోసం ఉత్తర్వులను తెలంగాణ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ జారీ చేసినట్లు తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ గడువు ప్రక్రియ జూన్ 12 నుంచి ఆగస్టు 12 వరకు కలదని, ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ పొందగోరే అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆ దరఖాస్తులను సంబంధిత స్టడీ సెంటర్‌లో సబ్‌మిట్ చేయాలని సూచించారు.

ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ తెలిపారు. టీజీటీ తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బీఈడీ, టీపీటీ, హెచ్‌పీటీ, టీఈటీ క్వాలిఫికేషన్ ఉండాలని అన్నారు. పీజీటీ తెలుగు-2 పోస్టులు, ఇంగ్లీష్-2 పోస్టులు, ఫిజిక్స్-1 పోస్టు, కెమిస్ట్రీ-1 పోస్టు, బాటనీ-1 పోస్టు, కామర్స్-1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడంతో పాటు బీఈడీ పూర్తి చేసినవారు ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

శాంతియుత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

ఎస్పీ అశోక్ కుమార్



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లు, మసీదులు, మార్కెట్ ప్రాంతాలు, టవర్ తదితర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్స్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు వాహనాలు తనిఖీ చేపట్టి పశువుల అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్టు చేసినా, ఫార్వర్డ్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్‌ఐ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్సైగా పదోన్నతి


స్టార్‌ను అలంకరిస్తున్న ఎస్పీ

జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఆరీఫ్ ఏఎస్సైగా ఇటీవల పదోన్నతి పొందాడు. ఈ సందర్భంగా ఆరీఫ్ మర్యాదపూర్వకంగా ఎస్పీ అశోక్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పదోన్నతి పొందిన ఆరీఫ్‌కు ఎస్పీ స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలీస్ శాఖపై నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా నడుచుకోవాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ సత్యప్రసాద్


దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై వచ్చిన ప్రతదరఖాస్తు పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని వీరాపూర్, దావన్‌పెల్లి గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరగా క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, శ్రీనివాస్, రాయికల్ తహసీల్దార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను భూ సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాతారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును సందర్శించారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్, ఆర్‌ఐ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సన్నద్ధంగా ఉంచాలి

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా పాఠశాలలను ఇప్పటినుంచే సన్నద్ధంగా ఉంచాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ విద్యాశాఖ, వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాడిబాట, పాఠశాలల పునః ప్రారంభంపై కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పాఠశాలలను ఇప్పటి నుంచే పరిశుభ్రంగా ఉంచాలని, తాగు నీటి వసతులు, టాయిలెట్స్, వంట గదులను శుభ్రపరచాలని అలాగే కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో టీచర్లు ఇంటింటి సర్వే చేయాలని, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు మానిటరింగ్ చేసినపుడే బడిబాట కార్యక్రమం విజయవంతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని మండల అధికారులు, విద్యాశాఖ కోఆర్డినేటర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ దరఖాస్తులకు ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి గానూ బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రవేశం నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. మొత్తం ఐదు సీట్లు ఉండగా, మూడో తరగతిలో లంబాడ బాలికలకు(1), బాలురకు(1), గోండు బాలురకు(1), ఐదో తరగతిలో ఎరుకల బాలురకు(1), గోండు బాలురలకు(1) చొప్పున కేటాయించామన్నారు. ఎనిమిదో తరగతిలో లంబాడ బాలికలకు ఇక సీటు కేటాయించబడిందన్నారు. అభ్యర్థులు జగిత్యాల జిల్లాకు చెందినవారై ఉండాలని, తల్లిదండ్రుల వార్షికాదాయం అర్బన్ ఏరియాలో రూ.2 లక్షలలోపు, అర్బన్ ఏరియాలో రూ.1.50 లక్షలు ఉండాలన్నారు. ఎస్టీ కుటుంబాలకు చెందిన 3వ, 5వ, 8వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను జూన్ 9 నుంచి 17వ తేదీవరకు సాయంత్రం 5గంటలలోగా జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ జగిత్యాల కార్యాలయంలో తగు ధ్రువీకరణ పత్రాలతో జతచేసి అందజేయాలని కోరారు. ఈ నెల 20వ తేదీన లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఒకే కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని విద్యార్థులు గమనించాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా గిరిజన కార్యాలయం జగిత్యాల ఫోన్ నంబర్ 8499992214లో సంప్రదించాలని కోరారు.

దూలూరు, సిరికొండ గ్రామాలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరు

కథలాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దూలూరు, సిరికొండ గ్రామాలకు నూతనంగా అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇందులో రూ. ఎనిమిది లక్షలు ఉపాధి హామీ, రూ. రెండు లక్షలు 15వ ఆర్థిక సంఘం, రూ. రెండు లక్షలు మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి నిధులు కేటాయించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి మేరకు నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, అజీం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమెట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు గూడు నిర్మించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పడాల అంజిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఆర్మూర్ గంగాధర్, ఏలేటి మహిపాల్‌రెడ్డి, లింగంపల్లి రాజరెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ స్రవంతి

కథలాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోసానిపేటలోని అంగన్‌వాడీ కేంద్రా ల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 30 నెలల వయస్సు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సుజాత, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి పద్మావతి

జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) :చిన్న చిన్న కేసులను పరిష్కరించుకునేందుకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి పేర్కొన్నారు. జగిత్యాల కోర్టు ఆవరణలో ఈ నెల 14 న నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేసేందుకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి హాజరై మాట్లాడారు. లోక్ ఆధాలత్‌ను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం లోక్ ఆదాలత్ నిబంధనలపై సమగ్ర చర్చ నిర్వహించారు. సమీక్ష సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్, న్యాయమూర్తులు నారాయణ, వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య వర్మ, లావణ్య, శ్రీనిజ, డీఎస్పీ రఘు చందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, ఇన్స్యూరెన్స్ కంపెనీల న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

తిప్పన్నపేట రోడ్డు విస్తరణకు రూ. 16.5 కోట్లు మంజూరు

జగిత్యాలరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి తిప్పన్నపేట గ్రామశివారు వరకు జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న కారణంగా బ్లాక్ స్పాట్ రోడ్డుగా గుర్తించారు. ఈరోడ్డులో ప్రమాదాల నివారణకు రోడ్డు విస్తరణతో పాటు డివైడర్ల ఏర్పాటు వంటి వాటి కోసం 16. కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. త్వరలో పనులు కూడా ప్రారంభం కానున్నాయి. నిత్యం ఈ రోడ్డులో ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు కావడంతో తిప్పన్నపేట, పరిసర ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

కథలాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోటకు చెందిన లావుడ్య శంకర్‌నాయక్ అనే కాంగ్రెస్ నాయకుడి కాలుకు శస్త్ర చికిత్స జరగగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కాలికి చికిత్స చేయించుకున్నాడు. ఆయన వెంట రాష్ట్ర ఫిషరీస్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాజేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే

- జిల్లా విద్యాశాఖాధికారి రామునాయక్ - జిల్లా వ్యాప్తంగా బడి బాట ర్యాలీలు





వేంపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈవో రామునాయక్, రాయికల్ మండలంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ధర్మపురిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

మెట్‌పల్లి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులదేనని జిల్లా విద్యాశాఖాధికారి రామునాయక్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని వేంపేట గ్రామంలో ర్యాలీ నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామంలో బాడిబాట నిర్వహించి విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అనంతరం బడిబాట కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించి, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సిద్ధం చేశామన్నా రు. ప్రాథమిక స్థాయిలోనే ఏఐ ఆధారిత విద్యావిధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని నాయకులు ప్రతీఒక్కరు కనీసం ఐదుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. సైనిక్ స్కూల్, నవోదయలో ప్రవేశం పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పల్లి శేఖర్‌గౌడ్, గోరుమంతుల ప్రవీణ్, గాజంగి రాజమల్లయ్య, ఎల్లాల రామ, లాస్య, ప్రధానోపాధ్యాయుల నాగరాజకుమారి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడి బాట కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్య, పౌష్టికాహారం, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్ లాంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన, విశాలమైన తరగతి గదులు ఉన్నట్లు ఆయన వివరించారు. అలాగే ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాల, దొనూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, కమలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల్లో కూడ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఎంఈవో సీతాలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు పెండ్యాల మహేందర్, కొలిచాల శ్రీనివాస్, స్వప్నప్రియ, మహేష్, ఉపాధ్యాయులు కవిత, జ్యోతి, గణేష్, వంశీకృష్ణ, రమేష్, మ్యాన పవన్ కుమార్, ఆసిఫ్, ప్రీతి, రాజేష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని మైతాపూర్ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముక్కాల మోహన్ రెడ్డి, మధు, గంగరాజం, నర్సయ్య, గంగరాజం, రజనీకాంత్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని ఇప్పపల్లిలో శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న వసతుల.. (మిగతా 8వ పేజీలో..)

మాతాశిశు సంరక్షణ కేంద్రంలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమని బాధితుడి ఫిర్యాదు, కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మతాశిశు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రసవసమయంలో శిశువు మృతి చెందినట్లు కరీంనగర్‌రూరల్ మండలం చెర్లబూత్కూర్‌కు చెందిన లింగంపల్లి మహేష్ టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. తన భార్య లింగాల వనితను మాతాశిశుఆస్పత్రిలో గురువారం సాయంత్రం ప్రసవం కోసం చేర్పించామని, హార్ట్‌బీట్ చెక్ చేసేందుకని కింది అంతస్థు, పైఅంతస్థుకు రెడుసార్లు నడిపించారని పేర్కొన్నాడు. పురిటినొప్పులతో బాధపడుతున్న తనభార్యను పట్టించుకోకుండా పెద్దడాక్టర్ రావాలంటూ అర్ధరాత్రి 12వరకు తాత్సారం చేశారని, చివరకు ఆపరేషన్ థియే టర్‌లోకి తీసుకెళ్లారని తెలిపాడు. అనంతరం ఆపరేషన్ సమయం లో శిశువు గుండె ఆగిపోయి చనిపోయినట్లు తెలిపారని పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు.

బావిలోపడి వృద్ధురాలి మృతి


శంకరవ్వ (ఫైల్)

లక్షెట్టిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంప లపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి బొప్పు శంకరవ్వ(69) మృతి చెందింది. మృతురాలి స్వస్థలం ధర్మపురిమండలం రాయపట్నం. ఈనెల4న తనమనుమడి వివాహం సందర్భంగా గంపలపల్లికి వచ్చింది. రాత్రి ఇంటికి వెళ్తున్నట్లు బంధువులతో చెప్పి వెళ్లిపోయింది. అర్ధరాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మరుసటిరోజు రాత్రివరకు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కూతురు మంగవ్వ లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఎస్సైసురేష్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం గంపలపల్లి ఇంటి సమీపంలో మృతురాలు మృతదేహం లభ్యంకాగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ చెరువులో పడి ఒకరి మృతి

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామంలో ట్రాక్టర్‌తో పంటచేనును దున్నుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి కామెర తిరుపతి(45) అనేవ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంథని మండలం దుబ్బపల్లికి చెందిన తిరుపతి తన అత్తగారి గ్రామమైన చెన్నూరు మండలం గంగారం గ్రామానికి నెల రోజులక్రితం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. తిరుపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌తో తన బంధువుల పంట చేనును దున్నుతున్నాడు. ట్రాక్టర్‌ను రివర్స్‌లో ఒడ్డుపైకి ఎక్కిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌పక్కనఉన్న చేపలచెరువులో పడింది. అందులో కొంతనీరు ఉండడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. తిరుపతికిభార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకుకేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

బైపాస్ రహదారికి మోక్షమెప్పుడో?



- పెద్దపల్లి పట్టణం మీదుగా రాజీవ్ రహదారి
- నిత్యం ప్రమాదాలు
- ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతం
- ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినా ప్రారంభంకాని పనులు

పెద్దపల్లిటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి బైపాస్ రహదారి నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. పదిహేను ఏళ్లుగా ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా బైపాస్ రోడ్డు కల నెరవేరడం లేదు. దీంతో ట్రాఫిక్ అంతరాయంతోపాటు తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బైపాస్ రోడ్డుకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు మొదలుకావడం లేదు.

ప్రతిపాదనలు ఇలా...

బైపాస్ రహదారితోపాటు రింగ్ రోడ్డు లేదా పట్టణం నుంచే ఫ్లైఓవర్‌లో ఏదో ఒకటి నిర్మించాలని గతంలోనే నిర్ణయించారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల నుంచి చందపల్లి మీదుగా అప్పన్నపేట వద్ద రాజీవ్ రహదారికి లింక్ అయ్యేలా నిర్మించాలని ప్లాన్ చేశారు. అలాగే పెద్దకల్వల నుంచి హన్మంతునిపేట మీదుగా అప్పన్న పేట ఫ్లైఓవర్ లింక్ అయ్యేలా మరో ప్లాన్ చేశారు.

కానీ ఇప్పటి వరకు ఈ రెండు అమలుకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా బైపాస్ రోడ్ నిర్మాణంలో ఆలస్యం అవుతుండటంతో ప్రయాణికులు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే బైపాస్ నిర్మాణం మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసర్వే చేసేందుకు అధికారులను పురమాయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబర్ 4, 2024న పెద్దపల్లి పర్యటనకు వచ్చినప్పుడు బైపాస్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. 80 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారు.ఆరు నెలలు పూర్తవుతున్నా, రోడ్డు నిర్మాణానికి అడుగు ముందుకు పడడంలేదు.

పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు

వాహనాల సంఖ్య పెరిగిపోతున్నా అందుకు తగిన పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించలేని విధంగా తయారైంది. జిల్లా కేంద్రంలో రాజీవ్ రహదారిని ఆనుకొని రంగంపల్లి నుంచి శాంతినగర్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఈ రహదారి ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు పట్టణం వాహనాలతో బిజీగా ఉంటుంది. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ట్యాక్సీ కార్ల కోసం పెద్దపల్లి జూనియర్ కాలేజీ, బస్టాండ్ ఏరియాల్లో పార్కింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆటోలకు కూడా పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలిపిన ఆటోలు

ఇరుకు రోడ్డు... పెరిగిన రద్దీ

పట్టణంలోని మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి పెద్ద కల్వల కలెక్టరేట్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో బైపాస్ రోడ్డు అవసరమని 15 ఏళ్ళ క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ రహదారిపై ఇసుక, మట్టి లారీలతోసహా అన్ని వాహనాలు పట్టణం మధ్య నుంచే వెళ్ళాల్సి ఉంటుంది. గోదావరిఖని వద్ద 25 ఏళ్ళ క్రితం గోదావరి బ్రిడ్జి నిర్మించడంతో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. జమ్మికుంట వైపు రెండు బ్రిడ్జిలు నిర్మించడంతో వరంగల్ వైపు వెళ్ళే వాహనాలు పెద్దపల్లి మీదుగా వెళ్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. ట్రాఫిక్ పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా నియంత్రించలేకపోతున్నారు. ప్రధానంగా బస్టాండ్, అయ్యప్ప సర్కిల్, ఆసుపత్రి చౌరస్తా, కూనారం రోడ్డు, కమాన్‌చౌరస్తాలో ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపైనే ఆటోలు నిలపడంతో ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ రహదారిని ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నారు. కూనారం సర్కిల్‌లో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు 3,900 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా మొదటి అదనపుజడ్జి నారాయణ శుక్రవారం తీర్పునిచ్చారు. జగిత్యాల జిల్లాలోని రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి సామల్ల అరవింద్ (28) అనే యువకుడు 2021 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై రాయికల్ పోలీసులు పోక్సో కింద కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కృష్ణ కుమార్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్ కిరణ్ శుక్రవారం సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

దాడి కేసులో నలుగురికి నాలుగేళ్ల జైలు శిక్ష

- రూ. 5 వేల జరిమానా

వేములవాడ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఒకరిపై నలుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటనలో నాలుగేళ్ల జైలు శిక్షతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు పోలీసులు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అనుపురం గ్రామానికి చెందిన లక్ష్మీరాజ్యం అనే వ్యక్తిని తన భార్య బాలవ్వని పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్, అంజయ్య, ముత్తయ్య, ప్రసాద్, శశి అనే ఐదుగురు కలిసి దాడిచేయడంతో బలమైన గాయం అయ్యిందని, అప్పటి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టులో అప్పటి ఎస్సై మారుతి, కోర్టు కానిస్టేబుల్ మధు కలిసి సాక్షులను ప్రవేశపెట్టగా, సాక్షులను విచారించిన కోర్టు నలుగురిపైనేరం రుజువుకావడంతో ప్రవీణ్, అంజయ్య, ముత్తయ్య, శశిలకు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటుగా రూ. 5 వేల జరిమానా విధించినట్లు రూరల్ సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారులోని కెనాల్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం రాగలపల్లికి చెందిన ఇండ్ల కనకరాజు(39) మృతిచెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కనకరాజు కరీంనగర్ నుంచి జగిత్యాలకు బైక్‌పై వెళుతుండగా ఉదయం 6గంటల సమయంలో ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కనకరాజును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి కుటుంబ సభ్యులు మరొక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో?

- మూడేళ్ల క్రితం నిధులు మంజూరు
- టెండర్ ప్రక్రియ పూర్తయినా ప్రారంభంకాని పనులు
- పెగడపల్లిలో లో లెవల్ బ్రిడ్జితో ప్రయాణికుల ఇక్కట్లు

పెగడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెగడపల్లి నుంచి గోపాల్‌రావుపేట వెళ్లేమార్గంలో పెగడపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. నిధులు మంజూరై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తికాగా పనుల ప్రారంబానికి నోచుకోక దాదాపు మూడేళ్లవుతోంది. వర్షాకాలంలో భారీవర్షాలు కురిసినపుడు లోలెవల్ బ్రిడ్జిపై నుంచిభారీగా వరదనీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిధులు మంజూరయ్యాయి, బ్రిడ్జి నిర్మాణం జరిగితే తమ ప్రయాణబాధలు తీరిపోతాయని ఆశపడ్డ మండలప్రజలకు, ప్రయాణికులకు మూడేళ్లవుతున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ ఆదిత్యను వివరణ కోరగా కాంట్రాక్టర్ మరణంతో పనులు ప్రారంభం కాలేదని, త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పెగడపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో లో లెవల్ బ్రిడ్జి

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ఒకే కుటుంబంలోని ఆరుగురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులంతా గుంటూరు జిల్లా వాసులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించిన ఓ కుటుంబం తిరుగు ప్రయాణంలో కారు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి మూలమలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం మండలం నల్లపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన చల్ల గిరిధర్‌రెడ్డి, అతని భార్య సంగీత, వదిన రాధ ఆమె పిల్లలు సాత్విక, సాహిత్య, మనోజ్ఞలు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చల్ల గిరిధర్‌రెడ్డి నిజామాబాద్ పట్టణంలో ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. తిరిగి వెళ్తున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన పాముల సతీష్ ట్రాలీ ఆటోతో కారు అతివేగంగా ఢీకొట్టాడు. బాధితుడు గిరిధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామశివారులో గురువారంరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగాఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు అడవిపదర గ్రామానికి చెందిన నవీన్, పవిత్ర, మమత, రవీందర్‌కు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను మండలకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లిలోని నవీన్ తన ద్విచక్రవాహనంపై పవిత్ర, మమతతో కలిసి ఎల్లారెడ్డిపేటనుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. అడవిపదిరనుంచి రవీందర్ తనబైక్‌పై ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.కేసునమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నామని పోలీసులుతెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- పలువురిపై కేసు నమోదు


జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని ధరూర్ క్యాంపులోని నీటిపారుదలశాఖకు చెందిన ప్రభుత్వ భూమికి కబ్జాచేసేందుకు యత్నించిన ఇద్దరితోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాలటౌన్ సీఐ వేణుగోపాల్ ఒకప్రకటనలో తెలిపారు. ధరూర్ క్యాంపులోని సర్వేనంబరు 163లో దేవతామూర్తుల విగ్రహాలను అడ్డం పెట్టుకుని ఐదు గుంటల భూమిని కబ్జాకు యత్నిస్తున్నారనినీటిపారుదలశాఖ ఏఈఈ ఇంద్రాల జాగృతి పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో చొప్పరిరాజు, జిట్టవేణి అరుణ్‌తోపాటు మరికొంత మందిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ వేణుగోపాల్ వివరించారు.

దొంగతనానికి యత్నం

గంగాధర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని వైన్స్ పర్మిట్‌రూం తలుపులు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోయినపల్లిదారిలోని వైన్స్ పర్మిట్‌రూం తలుపులను అర్ధరాత్రి పగులగొట్టి రూంలోని వస్తువులను చిందరవందర చేసినట్లు గుర్తించారు. రూంలో ఎలాంటివస్తువులు అపహరణకు గురికాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.యజమాని లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం ఇరుకుల్లకు చెందిన కాశిపాక భరత్ జనవరి 26న తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా శుక్రవారం అప్పగించామని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో రూరల్ కానిస్టేబుల్ విశ్వతేజ సాంకేతిక పరిజ్ఞానంతో ఆ సెల్‌ఫోను మంచిర్యాలలో ఉన్నట్లుగా గుర్తించారని, స్వాధీనం చేసుకొని బాధితుడు భరత్‌కు అప్పగించామని పేర్కొన్నారు. కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

రోడ్డుపై పరుచుకున్న పచ్చదనం

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో బాటసారులకు చల్లని నీడను ఇస్తున్నాయి. మండలంలోని పండలాపూర్, కందికట్కూర్ గ్రామాల మధ్యలోని ప్రధాన దారి వెంట గతంలో నాటిన మొక్కలు గుబురుగా పెరగడంతో అటుగా వెళుతున్న వారి చూపులను ఆకట్టుకోవడమే కాకుండా వీటి నీడన కొంతసేపు సేద తీరుతున్నారు.

హద్దులు చెరిపిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

రామడుగు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని సర్వేనం.146లోని ఎస్సీకాలనీకి చెందిన భూమిని హద్దులు చెరిపి సాగు చేసుకుంటున్న కాంగ్రెస్‌పార్టీకి చెందిన కల్లెపల్లి అంజ య్యపై కేసు నమోదు చేయాలని కాలనీవాసులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాయంత్రాంగం స్పందించి 42 సంవత్సరాల నుంచి కబ్జాకాబడుతున్న భూమిని కరీంనగర్ ఆర్డీవో పర్యవేక్షణలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే చేసి హద్దులు నిర్ణయించారని అన్నారు. హద్దులు చెరిపి సాగు చేసుకుంటున్న విషయమై గ్రామ పెద్దలు, యువకులు ప్రశ్నించగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టకుంటే కరీంనగర్ ఆర్డీవో, పోలీస్ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కనకం వంశీ, కనకం కొమురయ్య, చిలుముల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో స్టార్టర్లు, ఫీజులు దగ్ధం

- గునుకుల కొండాపూర్‌లో తెగిపడిన 11కేవీ విద్యుత్ వైర్


రైస్‌మిల్‌లో కాలిపోయిన విద్యుత్‌మీటర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏడీ సత్యనారాయణ రావు

గన్నేరువరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా 11కేవీ విద్యుత్ వైరు తెగి వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌సరఫరా చేసే లైన్ పైన పడడంతో 14మంది రైతులకు చెందిన స్టార్లర్లు, ఫీజులతోపాటు మినీ రైస్‌మిల్ మీటర్ మొత్తం షార్ట్ సర్క్యూట్ అయి దగ్ధం అయ్యాయి. ఒక్కసారిగా హైవోల్టేజీ రావడంతో తమ స్టార్లర్లు, ఫీజులు కాలిపోయాయని అన్నారు. మళ్లీ కొత్తస్టార్లర్లు, ఫీజులు కొనడానికి సుమారు ఐదువేలు ఖర్చు అయిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికలోడ్ ఉండడంతో ప్రతిరోజు విద్యుత్‌సమస్యలు తలెత్తుతున్నాయని విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి మరోట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రైస్‌మిల్‌లో కాలిన విద్యుత్‌మీటర్‌ను విజిలెన్స్ ఏడీ సత్యనారాయణరావు పరిశీలించారు.

యారన్ సబ్సిడీ అందించాలి


వినతిపత్రం అందిస్తున్న టెక్స్‌టైల్ పార్కు కార్మికులు

తంగళ్లపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కులో కార్మికులకు యారన్ సబ్సిడీ తక్షణమే అందించాలని, నిరంతరం ఉపాధితోపాటు మెరుగైన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చేనేత జౌళిశాఖ జాయింట్‌డైరెక్టర్ ఎన్‌వీరావుకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామ శివారులో టెక్స్‌టైల్‌పార్కులో సీఐటీయూ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో యారన్ సబ్సిడీ, ఉపాధి తదితర కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ క్రమంలో శుక్రవారం చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్‌విరావు టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఎన్‌వి రావును కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. సానుకులంగా స్పందించి వారంరోజుల్లో యారన్ సబ్సిడీ విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు అధ్యక్షుడు కూచన శంకర్, మామిడాల శ్రీనివాస్, రాచర్ల వేణు, పులి రమేశ్, కందికట్ల శ్రీనివాస్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్‌అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. జిల్లాక్రికెట్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్, వేములవాడ, జగిత్యాల, గోదావరిఖనిలో నిర్వహించిన శిబిరాల్లో 700మంది క్రీడాకారులు 25రోజులపాటు శిక్షణ పొందారు. ఈశిబిరాల్లో బాలబాలికలకు బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్, ఫీల్డింగ్, క్యాచింగ్ తదితర అంశాల్లో శిక్షణ అందించారు. ఈ శిబిరాల్లో శిక్షణ పొందిన బాలబాలికలకు హైదరాబాద్ క్రికెట్‌అసోసియేషన్ అపెక్స్‌సభ్యులు అందించిన సహకారంతో నిర్వాహకులు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, మనోహర్‌రావు, రవీందర్‌గౌడ్, నితిన్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలతో శిక్షణ పొందిన క్రీడాకారులు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

జగిత్యాలరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామివేత్తలుగా ఎదగాలని జిల్లా అలీప్ రాష్ట్ర మహిళశక్తి ప్రాజెక్ట్ అధికారి అన్నపూర్ణ సూచించారు. జగిత్యాల రూరల్ మండలం ఐకేపీ కార్యాలయ సమావేశ మందిరంలో జగిత్యాల, చొప్పదండి నియోజకవర్గాలకు చెందిన మహిళా స్వయం సహాయక సభ్యులకు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మట్లాడుతూ మహిళాసంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రణాళికను రూపొందించిదని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి యాదగిరి, ఏపీడీ చరణ్‌దాసు, డీపీఎంలు భారతి, మల్లేశం, జిల్లా ఏపీఎం చక్రవర్తి, మండల ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, మరియా, శ్రీనివాస్, సాగర్, జగిత్యాల, చొప్పదండి మహిళా సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 30క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ట ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.6500 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.



విడతలు	నిధులు (రూ.కోట్లలో)	లబ్ధిపొందే రైతులు	ఎకరాలు
తొలి విడత (2025-26)	600	10,000	27,184
రెండో విడత (2026-27)	3,000	50,000	1,43,204
మూడో విడత (2027-28)	3,000	50,000	1,43,204
నాలుగో విడత (2028-29)	3,000	50,000	1,43,204
ఐదో విడత (2029-30)	3,000	50,000	1,43,204
మొత్తం	12,600	2,10,000	6,00,000

పోడు భూములకు జల సిరులు

ఇందిర సౌర గిరి జల వికాసం

- ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలుకు కసరత్తు
- రాష్ట్రంలో తొలి విడతలో 10 వేల మంది ఎస్టీ రైతులకు వర్తింపు
- ఐదేళ్లలో ఐదు విడతల్లో ఆరు లక్షల ఎకరాలకు నీరు
- రాష్ట్రంలో 2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు లబ్ధి
- రూ.12,600 కోట్ల బడ్జెట్ అంచనా

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల పోడు సాగుకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌వోఆర్ పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లో నీటి వనరులున్న భూములకు కాకుండా సేద్యానికి అవసరమైన సాగు నీరు అందించేందుకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదు సంవత్సరాల్లో ఐదు విడతలుగా రూ.12,600 కోట్ల నిధులతో 2.10 లక్షల మంది గిరిజన రైతులకు చెందిన ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిపై ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు.

లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

ఇందిర సౌర గిరి జల వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం మండల కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఎంపీడీవో, భూగర్భ జల అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, గిరిజనాభివృద్ధి శాఖ అధికారి సభ్యులుగా ఉంటారు. ఆర్‌వోఆర్ పట్టాలు అందుకున్న పోడు భూములకు చెందిన గిరిజన రైతుల నుంచి కమిటీ దరఖాస్తులను స్వీకరించనుంది. వాటిని పరిశీలించి బోరు వేస్తే నీరు వచ్చే భూములను గుర్తించి ఎంపిక చేయనున్నారు. పథకంలో భాగంగా పోడు భూముల్లో సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరందించనున్నారు. సౌర విద్యుత్‌తో పంప్ సెట్లు నడిపించుకోగా మిగులు విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు విక్రయించే అవకాశం ఉంటుంది. మిగులు విద్యుత్ ద్వారా గిరిజన రైతులకు నెలకు ఐదు వేల రూపాయల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు. సోలార్ విద్యుత్ పరికరాలు అమర్చి బోరు బావిలో మోటార్ బిగించనున్నారు. భూముల స్వభావాన్ని బట్టి జామ, మామిడి, నిమ్మ, వివిధ రకాల పూల సాగు, ఆయిల్‌పామ్ ఇతర తోటలు పెంచేలా రైతులను ప్రోత్సహించడానికి కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..



ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ద్వారా పోడు భూములకు సాగు నీరు అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈమేరకు అవసర మైన కసరత్తులు చేస్తున్నాం. గిరిజన రైతులకు చెందిన అర్హమైన పోడు భూములను గుర్తించడం, సాగునీరు, సౌర విద్యుత్ సౌకర్యాలను కల్పించడా నికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. అర్హులైన రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రాజ్‌కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి, జగిత్యాల

అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



జంగంకుంట చెరువును పరిశీలిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల అనుమతి లేకుండా అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్ గ్రామశివారులోని జంగంకుంట చెరువును ఆయన మండల నాయకులు, రైతులతోకలిసి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న కాళేశ్వరం లింక్-2కాలువ పక్కనే ఉన్న చెరువులోని నీటిని మెగాకంపెనీ పైపులద్వారా తరలించారని స్థానికరైతులు అధికారులకు, పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విప్ లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం చెరువును పరిశీలించి మాట్లాడుతూ చెరువులో నీటిని ఎట్టిపరిస్థితిలో తీయవద్దని ఇరిగేషన్‌శాఖ డీఈ నర్సింగరావును ఆదేశించారు. రైతులు త్యాగంచేసి భూములు ఇవ్వడంవల్లనే నేడు ప్రాజెక్టుపనులు సాగుతున్నాయని అన్నారు. రైతులు తమ విలువైన భూములు ఇచ్చినపుడు వారిని గౌరవించడం నేర్చుకోవాలని ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. మరోసారి ఇలాంటి సమస్య ఉత్పన్నమైతే చట్టపరమైన చర్యలు తప్పవని మెగా కంపెనీ ఏజీఎం దినేష్ సింగ్‌ను లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు.

వ్యాపారం పేరిట మోసం.. ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వ్యాపారం పేరిట రూ.92 లక్షలు తీసుకొని మోసం చేసిన కేసుల్లో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైం డీఎస్పీ నరసింహారెడ్డి వివరాల ప్రకారం. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద 2024 జూలై, నవంబరుల్లో మహారాష్ట్ర పూణేకు చెందిన ప్రసాద్ సురేష్ గువహానే, చందన్‌విఠల్ గువహానే, ఉస్మానాబాద్ జిల్లాకు చెందిన శ్రేయాస్ ముకుంద్‌కోలి బిజినెస్ ఇన్వెస్ట్మెంట్, రేటింగ్ అండ్ రివ్యూ ప్రకటనలు, పార్ట్‌టైం ఉద్యోగాల కల్పన వంటి విషయాలతో బాధితులను ఆకర్షించి రూ.92 లక్షలు పలు దఫాలుగా డిపాజిట్ చేయించుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో మహారాష్ట్రలో అరెస్టు చేసి శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

జీవాలకు మెరుగైన చికిత్స అందించాలి

- 8న రాజన్న కోడెల పంపిణీ
- కలెక్టర్ సందీపకుమార్ ఝా



రాజన్న కోడెలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని అనారోగ్యంతో ఉన్న కోడెలకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వెటర్నరీ అధికారులకు సూచించారు. గోశాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి కోడెలకు అందుస్తున్న చికిత్సను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదిన ఆదివారం గోశాలలోని కోడెల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన కోడెలకు అందిస్తున్న చికిత్సపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నామని, వాటి పరిస్థితులను స్వయంగా పరిశీలించామన్నారు. గోశాలలోని పెద్ద కోడెల ద్వారా గాయాలపాలైన చిన్న కోడెల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత ఉద్యోగులకు సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఈనెల 8వ తేదిన ఆదివారం గోశాలలోని కోడెలను అర్హులైన రైతులకు అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన రైతులు ఆన్‌లైన్‌లో జిల్లా వెబ్‌సైట్ గాని ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జియో ట్యాగింగ్, వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేయడంతో కోడెలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.

మరో రెండు కోడెలు మృతి..

- అనారోగ్యంతో 11 కోడెలు.. 3 కోడెల పరిస్థితి విషమం,

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం తెల్లవారు జామున మరోరెండు కోడెలు మృతిచెందినట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హెల్త్ బుల్లెటిన్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకు మృతిచెందిన కోడెల సంఖ్య 31కి చేరింది. తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలలో రెండు కోడెలు మృతిచెందినట్లు తెలిపారు. గోశాలలో ఉన్న 1300 పశువులలో ప్రస్తుతం 11 కోడెలకు వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని, అనారోగ్యంతో ఉన్న కోడెలు కోలుకుంటున్నాయని పేర్కొన్నారు. కాగా గోశాలలోని 3 కోడెల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గోశాలలో కొత్తగా కోడెలు అనారోగ్యానికి గురికాలేదని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

మల్లాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామంలోని స్థానిక గంగ పుత్రులు శుక్రవారం భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని భక్తులు ఆలయంలోని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసుకొని నెత్తిన ఎత్తుకోని ఊరేగింపుగా డబ్బుచప్పుల మధ్య ఆలయానికి బయలు దేరారు. జల పందిరి వేసి సల్లగా చూడు తల్లి అంటూ బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు, గంగపుత్రులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి బయలు దేరిన భక్తులు

కీర్తి మెడికల్స్ ప్రారంభం

సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన కీర్తి మెడికల్స్‌ను శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేశ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్‌రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీర్తిమెడికల్స్ సేవలు 24గంటలపాటు అందుబాటులో ఉంటాయన్నారు. 30వేల రకాల మందులు, ప్రముఖ కంపెనీలకు చెందిన మందులు హోల్‌సేల్ ధరలకే లభిస్తాయన్నారు. కీర్తి మెడికల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జనరల్ మెడిసిన్స్, బేబీకేర్, సర్జికల్‌కు సంబంధించిన మందులుఅందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కీర్తి మెడికల్స్ మేనేజ్‌మెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కీర్తి మెడికల్స్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

రూములు లేవు..

- వేములవాడలో గదులు లభించక భక్తుల ఇబ్బందులు
- నందీశ్వర కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్నా లేవని చెబుతున్న ఉద్యోగులు
- తప్పని పరిస్థితిలో ప్రైవేటును ఆశ్రయిస్తున్న భక్తులు
- ఆలయ అధికారుల తీరుపై ఆగ్రహం

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న భక్తులు గదులు దొరకక తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రూములు ఖాళీగా లేవు.. ఇంకెక్కడనైనా చూసుకోండి.. అంటూ రాజన్న నందీశ్వర కాంప్లెక్స్‌లో విధులు నిర్వహించే సిబ్బందిచెబుతూ వారిని ప్రైవేట్ రూమ్‌లకు వెళ్లాలని చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' జాతర గ్రౌండ్‌లోని నందీశ్వర కాంప్లెక్స్‌ను విజిట్ చేయడంతో పలు విషయాలు వెలుగుచూశాయి. ముందుగా జాతరగ్రౌండులోని విచారణ కార్యాలయానికి వెళ్లి అడిగితే నందీశ్వర చౌల్ట్రీలో ఏసీ గదులు మొత్తంగా 57 ఉండగా, 21గదులు భక్తులకు ఇవ్వగా, మరో 36ఖాళీగా ఉన్నాయని సమాచారమిచ్చారు. అందులోనే ఏసీ గదులు 111ఉండగా 44గదులు భక్తులు తీసుకోగా 67 గదులు ఖాళీగా ఉన్నాయని అక్కడిసిబ్బంది తెలిపారు. నందీశ్వర చౌల్ట్రీలోకి గదులకు కోసం వెళ్లినభక్తులకు అక్కడ విధుల్లో అటెండర్ గదులు లేవని, మరెక్కడైనా తీసుకోవాలని చెప్పాడు.



నందీశ్వరలో తాళం వేసి ఖాళీగా ఉన్న గదులు

- పైరవీలు చేస్తేనే గదులు

వేములవాడ విచారణ కార్యాలయం వద్ద గదుల కోసం పెద్ద ఎత్తున భక్తులు నిరీక్షిస్తున్నారు. పైరవీలు చేస్తే తప్ప రూమ్‌లు ఇవ్వడం లేదని భక్తులు చెబుతున్నారు. తమ ముందే పైరవీలతో వచ్చిన వారికిగదులు కేటాయిస్తున్నారని, తమని మాత్రం క్యూలైన్‌లో నిలుచోబెట్టి లేనిపోనివి చెప్పి గదులు ఇవ్వడం లేదంటూ భక్తులు వాపోతున్నారు. రాజన్న ఆలయానికి చెందిన పది చౌల్ట్రీల్లో 453 గదులు ఉండగా శుక్రవారం సాయంత్రం వరకు 148గదులు మాత్రమే భక్తులకు ఇచ్చారు. గదులు ఖాళీగా ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

- విచారణ కార్యాలయం ఎదుటే ప్రైవేటు వ్యక్తులు..

రాజన్న ఆలయ విచారణ కార్యాలయం ఎదుట గేట్ వద్ద ప్రైవేటు లాడ్జీల నిర్వాహకులు నిలబడి భక్తులను భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. ఆలయ గదులు అయిపోయాయని మాయమాటలు చెప్పి తమ గదులకు తీసుకెళ్లి ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా ఆలయ అధికారులు పట్టింకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



విచారణ కార్యాలయం గేటు ఎదుట ప్రైవేట్ లాడ్జీల నిర్వాహకులు

- అస్తవ్యస్తంగా పారిశుధ్యం

వేములవాడ జాతర గ్రౌండ్‌లోని నందీశ్వర కాంప్లెక్స్‌లో వాటర్ ప్లాంట్ వద్ద నాచుతో మురికిగా మారినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గదుల వద్దకు వెళ్లే మార్గంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని గదుల్లో ఏసీలు పని చేయడం లేదు. అక్కడి సిబ్బందిని అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందీశ్వర కాంప్లెక్స్‌లో కుక్కలు తిరుగుతుండడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు.



ఖాళీ గదులను చూపిస్తున్న డిస్‌ప్లే

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా జట్టు

- ఫైనల్స్‌లో వరంగల్‌పై ఘన విజయం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి 47వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సొంతం చేసుకుంది. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 10 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికల జట్లు తలపడ్డాయి. శుక్రవారం నిర్వహించిన బాలుర ఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు వరంగల్ జిల్లా జట్టుపై 20-13 పాయింట్ల తేడాతో గెలుపొందింది. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ బహుమతులు అందజేశారు. జట్టుకు కోచ్‌గా మూల వెంకటేశ్, మేనేజర్‌గా శ్రీకాంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసర వేణి లక్ష్మణ్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, పెటాటీఎస్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి వేణుగోపాల్, సంఘం బాధ్యులు సురేందర్, ప్రేమ్, తిరుమలేష్, శ్రీనివాస్, రాజు అభినందించారు.



ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు.

రాజన్నకు ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తరించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

అర్హులందరూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలి

ఎంపీడీవో ఇ స్వరూప



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: కొడిమ్యాల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి?

ఎంపీడీవో: మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన రాంసాగర్ గ్రామంలో 17 ఇళ్ల నిర్మాణం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: కొడిమ్యాల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంత మందికి మంజూరయ్యాయి?

ఎంపీడీవో: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 444 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మూడు రోజుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కవుట్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రాంసాగర్ పైలెట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంత మందికి మొదటి బిల్లు వారి ఖాతాలో జమ అయింది ?

ఎంపీడీవో: రాంసాగర్ పైలెట్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు ఆరుగురికి మొదటి బిల్లు వారి ఖాతాలలో జమ చేశాము. రెండుమూడు రోజుల్లో మరో ముగ్గురికి ఖాతాలో మొదటి బిల్లు జమ చేస్తాము.

'భూ భారతి'ని సద్వినియోగం చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత





మల్యాలలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత, కోనాపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. మండలంలోని మానాలలో నిర్వహిస్తున్న భూ భారతి కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొని సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అందించాలని సూచించారు. ప్రతీ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, గిర్దావర్ రాణి , సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చినట్లు ధర్మపురి ఇన్‌చార్జి తహసీల్దార్ ఎంఏ మాజీద్ అన్నారు. ధర్మపురి మండలంలోని తుమ్మెనాలలో భూ భారతి రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్ యాదవ్, భాస్కర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అనిల్, సర్వేయర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని కోనాపూర్ గ్రామంలో శుక్రవారం భూ భారతి గ్రామసభను తహసీల్దార్ ఎం కిరణ్‌కుమార్ నిర్వహించారు. గ్రామంలో ప్రజల నుంచి 28 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆర్ఐ కరుణాకర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండలింగాపూర్, కొండ్రికర్ల గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌తో పాటు డీటీ అబ్దుల్ ఖాదిర్, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని నర్సింహులపల్లి, కోమన్‌పెల్లి గ్రామాల్లో తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూ భారతి గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో రైతుల ఇచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్, రాహుల్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

హన్‌మాన్ ఆలయ పునః ప్రతిష్ఠాపన

జగిత్యాలరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని మోరపల్లి గ్రామంలో శుక్రవారం రెండవ రోజులో భాగంగా హన్‌మాన్ ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విగ్రహాల ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

కోరుట్ల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమెట్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పడాల అంజిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, బొల్లె నర్సయ్య, ఏలేటి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వయోజన విద్యకు 'ఉల్లాస్'

(5వ పేజీ తరువాయి..)

పరిధిలో ఉన్న మహిళా సంఘాల్లోని సభ్యుల్లో నిరక్షరాస్యుల సంఖ్యను వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ల ద్వారా ఏపీఏలు గుర్తిస్తారు. ఈనెల చివరి నాటికి సంఘాల్లో నిరక్షరాస్యులను, మధ్యలో బడిమానిన వారిని గుర్తించి నివేదిక ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి పథకానికి సంబంధించిన విధివిధానాలను సెర్ప్ అధికారులకు, సిబ్బందికి సమగ్రంగా వివరించినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

● వలంటీర్లుగా మహిళా సంఘాల అక్షరాస్యులు..

డీఆర్‌డీవో, సెర్ప్ అధ్వర్యంలో నిరక్షరాస్యులను గుర్తించే ప్రక్రియ పూర్తి చేయగానే నిరక్షరాస్యులతో 15 నుంచి 20 మంది చొప్పున గ్రూపులను ఏర్పాటు చేస్తారు. ఆగ్రామంలో మహిళా సంఘాల్లో అక్షరాస్యులైన వారిని వలంటీర్లుగా ఎంపిక చేసి నిరక్షరాస్యుల గ్రూపులను కేటాయించి వారికి చదువు చెప్పిస్తారు. గ్రూపులో ఉన్న వారందరికి చదవడం, రాయడం వచ్చే వరకు వీరికి చదువు చెప్పే బాధ్యత వలంటీర్లదే. ఎలాంటి పారితోషికం గాని, గౌరవ వేతనంగా గాని లేకుండానే కేవలం సేవా భావంతో ఎంపికైన వలంటీర్లు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ పుస్తకాలు అందించడంతో పాటు పథకం విజయవంతం అయ్యేందుకు ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయుల ద్వారా సహకారం అందించనున్నారు.

● తల్లి చదువుతో కుటుంబాల్లో వెలుగులు....

తల్లి చదవడం ద్వారా ఆ కుటుంబంలో వెలుగు నిండుతుంది. చదువు విలువ తెలిసి కుటుంబమంతా అక్షరాస్యులు ఉంటే ఆ కుటుంబాల ద్వారా గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో పయనించేందుకు దోహదపడుతుంది. బడికి వెళ్లే పిల్లల సంఖ్య పెరగడంతోపాటు డ్రాపౌట్ తగ్గితే బాల్య వివాహాలపై అవగాహన పెరుగుతుంది. అక్షరాస్యులుగా మారడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన పెరిగి ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికి అందుతాయి.

మహిళలకు మంచి అవకాశం



- రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

నిరక్షరాస్యులైన మహిళలకు చదవడం, రాయడం నేర్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఉల్లాస్ పథకం చదువురాని వారికి మంచి అవకాశం. జిల్లాలో ఉన్న మహిళా సంఘాల్లో నిరక్షరాస్యుల వివరాలు వయోజన విద్యాశాఖ అధికారులకు అందజేస్తాము. ఉల్లాస్ పథకంలో భాగంగా మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులతో పాటు బడి మధ్యలో మానేసిన వారికి, దివ్యాంగులకు సైతం చదవడం, రాయడం నేరిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని నిరక్షరాస్యులైన మహిళలందరు సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని నెరవేర్చాలి.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూ భారతి చట్టం

మాజీ మంత్రి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ధరణి భూ సమస్యలకు మూలం అయితే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టం రూపొందించిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అభిప్రాయాలను క్రోడీకరించి భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించిందని అన్నారు. గత ప్రభుత్వం 2017 డిసెంబర్‌లో రెవెన్యూ అధికారుల ఇష్టానుసారంగా ధరణి పేరుతో భూ రికార్డుల ప్రక్షాళన చేసి రైతులకు శాపంగా మారి రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని ఆరోపించారు. నూతన భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి సమస్యలను ఫిర్యాదు రూపంలో తీసుకుని పరిష్కార మార్గం చూపుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై ప్రజలకు అండగా ఉండి న్యాయవాదిగా తాను న్యాయ సలహాలు అందిస్తానని హామీ ఇచ్చారు. 12 సంవత్సరాల పైబడి నిరంతరం సాగులో ఉన్న రైతులకు పట్టా చేసుకునే అవకాశం గత ధరణిలో లేని నూతన చట్టం కల్పించిందని అన్నారు. రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన తొమ్మిదేళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హతకు అనుగుణంగా, రాకీయాలకు అతీతంగా, ఆర్భాటాలు లేకుండా రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య, ఎద్దండి దివాకర్, షాకీర్, పొన్నం శ్రీకాంత్, తలారి రాజేష్, కడకుంట్ల నరేష్, కొత్తపెల్లి గోపాల్, రవీందర్, జగదీశ్, బాపురపు రాజీవ్, అశోక్, రాజేష్, సంతోష్, నర్సింహా రెడ్డి, రాజరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మెట్‌పల్లి రూరల్, జూన్, 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ స్వరూప, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మీప్రియ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక అధ్వర్యంలో శిక్షణలు, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రిజిస్ట్రేషన్, బ్యాంక్ రుణ సహాయం ఇప్పించడం జరుగుతుందన్నారు. పరిశ్రమలను మహిళలు సొంతంగా గ్రూప్‌గా నిర్వహించుకోవచ్చన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం వెంకటేష్, ఏపీఎంలు విమోచన, శంకర్, సీసీలు తిరుకోవెల వెంకటరమణ, సూరయ్య, శ్రీనివాస్, అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు

భీమారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేటలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. గ్రామానికి చెందిన జంగిలి వరలక్ష్మి, కట్కం జ్యోతి, సుధవేని విజయ, చింతలకోట అంజలి, గోస్కుల గంగారాంలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎర్ర నీల, కట్కం జ్యోతి, కొత్తపల్లి అజయ్, ఎండీ మక్బూల్, కొమిరెడ్డి తిరుపతి రెడ్డి, సొసైటీ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బూరం అరుణ్, అడ్లగట్ల ప్రేమ్, కొత్తపల్లి కిరణ్, ఉత్కం అజయ్, బక్కూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ11 ఏళ్ల పాలనతో దేశం సుభిక్షం



మల్యాలలో పార్టీ జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకుని దేశాన్ని ప్రపంచంలో ప్రశంసలు అందుకునేలా చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రధాని వికసిత భారత్ అమృత్ కాలం సేవా సుపరిపాలన పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కోకన్వీనర్ నంద్యారపు వెంకటేష్, కాశోజీ ప్రతాప్, కథలాపూర్ మహేశ్, గడ్డం జీవన్‌రెడ్డి, వినోద్, శాంతారం ఉన్నారు.

మల్యాల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో చారిత్రక విజయాలు సాధించిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి అన్నారు. మోదీ ప్రభుత్వం-సంకల్పంతో సాకారం పేరిట బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మల్యాలలో శుక్రవారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ సమర్థ నాయకుడు, నిర్ణయాత్మక నాయకత్వంలో వికసిత్ భారత్ దశగా మన దేశం ముందుకెళుతుందని అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బొట్ల ప్రసాద్, కొల్లూరి గంగాధర్, రమేశ్, సంగిని రవి, రాజు, బొడిగే సురేశ్, సామ మహిపాల్‌రెడ్డి, లత, రమ, పొన్నం సాయికుమార్‌గౌడ్, రాజుకుమార్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు నిర్వహించడం గొప్ప విషయం

ధర్మపురి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్వశోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించడం గొప్ప విషయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి అన్నారు. నెల రోజుల నుంచి ధర్మపురి జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కాంతాకుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఆత్మన్యూనతకు గురికాకుండా, వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ శిబిరంలో నెల రోజుల పాటు విద్యార్థులకు యోగా, కంప్యూటర్, సంగీతం, చిత్రలేఖనం, భగవద్గీత, ఆరోగ్యం, ఆర్థికశాస్త్రం తదితర అంశాలపై దేశ విదేశాల్లోని నిపుణులు టీవీ మాధ్యమం ద్వారా శిక్షణ ఇచ్చారు.

కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పెండ్యాల మహేందర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండి రాంకుమార్, సామాజిక సేవకులు గొల్లపల్లి గణేష్, యోగా గురువు పెద్ది శివకుమార్, సంస్థ నిర్వాహకులు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ వేదాంతం భార్గవ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ

మెట్‌పల్లిటౌన్,జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ భద్రత కోసమే ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులందరికీ ఇన్సూరెన్సు చేయించినట్లు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ప్రింట్ మీడియా మెట్‌పల్లి అధ్యక్ష, కార్యదర్శులు బూరం సంజీవ్, మహమ్మద్ ఆజీమ్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్‌లు మాట్లాడుతూ ఈ- శ్రమ్ కార్డ్‌లు చాలా ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. దేశంలో అధిక శాతం మంది భవన నిర్మాణం వంటి అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నవారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నాని తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులకు ఈ- శ్రమ్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ మోతాదులో ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ మోతాదులో ఎరువులు వాడాలని పొలాస వ్యవసాయ కళాశాల ఏడీఆర్ శ్రీలత అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లోని రైతు వేదికలో వానాకాలం-2025 సాగులో మెలకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు వరి పంటనే కాకుండా వివిధ రకాల పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. వానాకాలానికి వరి, మొక్కజొన్న రకాలు, వాటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పసుపు, మామిడిలోని యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దత్తత గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ డీఏ రజనీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవి, డాక్టర్ స్వాతి, ఏఈవో సృజన, ఎఫ్ఈవో చైర్మన్ అత్తినేని శంకర్, ఎఫ్ఈవో డైరెక్టర్లు ఓరుగంటి రాజలింగం, బొజ్జ దేవేందర్ రావు, అత్తినేని రాజం, ఎంబారి వెంకటేష్ పాల్గొన్నారు.

బుగ్గారం: మట్టి పోషకాలకు అనుగుణంగా పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని పొలాస వ్యవసాయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవి, డాక్టర్ స్వాతి రైతులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను శుక్రవారం మండలంలోని చిన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అక్షిత, ఏఈఓ నవీద్, పంచాయతీ కార్యదర్శి సిద్ధం సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

గొల్లపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఫలితాలు శుక్రవారం వెలువడగా గొల్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటారు. మోడల్ స్కూల్‌లో 8 వ తరగతి చదువుతున్న కె. హర్షిత్ రెడ్డి బి. ల్యా., ఎస్. రిషిక ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. వీరికి ఇంటర్ మీడియెట్ రెండవ సంవత్సరం వరకు నెలకు వెయ్యి రూపాయల స్కాలర్ షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని పాఠశాల ప్రిన్సిపల్ రవి తెలిపారు. వీరిని ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ జి. తిరుపతి అభినందించారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మామిడిపెల్లి మణికంఠ, కొమ్ము సిపివిష్ణులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమ్మెంతుల వెంకటరమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజాప్రతినిధులు అభినందించారు.

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సరితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపల్ నాగేష్, ఉపాధ్యాయ బృంతదం అభినందించారు.

వ్యాధి నిర్ధారణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాలరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత వ్యాధి నిర్ధారణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల మండలం మోతె ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం ప్రజలకు సమగ్రవ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, హెపటైటిస్-బీ, హెచ్ఐవీ వంటి పరీక్షలను చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపు శివారులో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలన జరిపారు. ప్రతీనెల చేసే తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధికారి హకీం తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధన్వంతరి ఆలయంలో కుంకుమ పూజలు

జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్యభగవాన్ ధన్వంతరి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రి అమ్మవారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కుంకుమ, లలిత సహస్ర నామ స్తోత్రాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారలకు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

యాదవులు అభివృద్ధికి కృషి

మెట్‌పల్లి రూరల్, జూన్, 6 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం అభివృద్ధికి సభ్యుల సమష్టి నిర్ణయాలతో కృషి చేస్తానని శ్రీకృష్ణ యాదవ పెద్ద సంఘం అధ్యక్షుడు కసాడి తిరుపతియాదవ్ అన్నారు. గ్రామంలో నూతన అధ్యక్షుడిగా కసాడి తిరుపతియాదవు, ఉపాధ్యక్షుడిగా లక్కం ప్రశాంత్, ప్రధానకార్యదర్శిగా గుండెల అంజయ్య, కోశాధికారి లక్కం రాజును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కుల సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో యాదవులు కలిసికట్టుగా కృషి చేసి హక్కులను సాధించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే





కథలాపూర్ మండలం ఇప్పపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, బీర్‌పూర్ మండలంలో బడిబాట కార్యక్రమంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

(5వ పేజీ తరువాయి)

గురించి ఇంటింటికీ తిరిగి వివరించారు. సర్కారు బడికే పంపించాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం గంగాధర్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, కోలి నరేందర్‌రెడ్డి, గ్రామస్థులు, యువకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బీర్‌పూర్: మండలంలో శుక్రవారం మండల విద్యాధికారి నాగభూషణం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలలు వద్దు ... ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అంటు నినాదాలు చేస్తు గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా కొల్వాయి జిల్లా పరిషత్ పాఠశాల శాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్ రావ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపెల్లి మండలం శ్రీరాముల పల్లి గ్రామంలో బాడిబాట కార్యక్రమంలో బాగంగా శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతి కార్యలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిజిహెచ్ఎం రాజన్న, మాజీ సర్పంచ్, అంగన్‌వాడి టీచర్‌లు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి డబ్బులు వృథా చేసుకోవద్దని, నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలంటూ ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఎంఈవో సులోచన, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమంను నిర్వహించారు. మ్యాడంపల్లి, తక్కళ్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ జయసింహారావు పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. మ్యాడంపల్లిలో గ్రామస్థులు ప్రత్యేకంగా కరపత్రాలు ముద్రించి ఇంటింటా అందించారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు బడి బాట ర్యాలీలను, సభలను నిర్వహించారు. ర్యాలీలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామాల ప్రముఖులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బడిబాట, గ్రామసభ కార్యక్రమంను గ్రామ ప్రత్యేకధికారి, ఎంఈవో గంగుల నరేషం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం సెర్ప్ ద్వారా కుట్టించిన స్కూల్ యూనిఫామ్స్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ఏపీవో శంకర్ అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల తుకారం గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.